ప్రజాశక్తి
సోమవారం 28 అక్టోబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



దుకాణంలో గ్యాస్ లీక్

- తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో ఓ దుకాణంలో గ్యాస్ లీక్ అయ్యింది. ఆ గ్రామానికి చెందిన సంతోష్ అనే దుకాణదారుడు టీ స్టాల్ నడుపు కుంటున్నాడు. టీ చేసే సమయంలో ఒక్కసారిగా గ్యాస్ బండ నుంచి మంటలు ఎగిసి పడ్డాయి. గ్యాస్ బండ నుంచి మంటలు చెలరేగడంతో పక్కన ఉన్న దుకాణదారులతోపాటు స్థానికులు పరుగులు పెట్టారు. స్థానికులు మంటలను అదుపు చేశారు.



సిలిండర్ నుంచి వ్యాపిస్తున్న మంటలు



శిథిల భవనంలో పాఠశాల



మధ్యలో నిలిచిన పాఠశాల భవనం

శిథిలావస్థలో పాఠశాల భవనం

-భయాందోళనలో విద్యార్థులు- అసంపూర్తిగా నూతన భవనం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో సోవ్వ పంచాయతీ మాలివలస పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో ఏ క్షణంలో కూలి పోతుందోననే భయంతో విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ విద్య నభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం మంజూరైనప్పటికీ భవనం నిర్మించి ప్లాస్టింగ్ చేసి తలుపులు కిటికీలు బిగించకుండా అసంపూర్తిగా వదిలేశారు. వంటశాల కూడా ప్లాస్టింగ్ చేసి తలుపులు కిటికీలు బిగించకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో, భవనం మంజూరైన ఫలితం లేకుండా పోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఈ పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నారు. భవనం పూర్తి కాకపోవడంతో శిథిలావస్థ భవనంలో తరగతుల నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఈ భవనం స్లాబ్, గోడలపై పెచ్చులు ఊడి పడుతున్నాయి. ర్షాకాలంలో స్లాబ్ పైనుంచి వర్షపు నీరు తరగతి గది లోపల కారుతుండడంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనం పూర్తి చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఆ గ్రామస్తులు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పాఠశాల, బోజన శాల భవనాలను పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, పలు సంఘాల నేతలు కోరుతున్నారు.

వైస్ ప్రిన్సిపల్‌ను కఠినంగా శిక్షించాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : అరుకు ఏపీఆర్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బోడ్ నాయిక్ ప్రవీణ్ కుమార్ మృతికి కారణమైన వైస్ ప్రిన్సిపల్ వై.నరసింహంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ ఐ, మహిళ సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గెస్ట్ హౌస్ నుండి పోలీసు స్టేషన్ బస్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పడ్డారు. ఈ సందర్భంగా పలు సంఘాల నేతలు మాట్లాడుతూ, వైస్ ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకొని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు..మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, విద్యార్థిపై వైస్ ప్రిన్సిపాల్ భౌతిక దాడి చేయడం సరికాదన్నారు. ఆశ్రమ పాఠశాలలో తరచు విద్యార్థులు మరణిస్తున్నా ఐటీడీఏ, జిల్లా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. విద్యార్థులు చనిపోతున్నా కనీసం సమగ్ర విచారణ చేపట్టక పోవడం దారుణమన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను, మండల కార్యదర్శి కె నర్సయ్య, గిరిజన మహిళా సంఘం మండల అధ్యక్షులు ఈశ్వరిలు మాట్లాడుతూ, వసతి గృహాల్లో హెల్త్ వాలంటీర్లను, నైట్ వాచ్మెన్ లను నియమించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె శంకర్, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు వి.లైకోన్, పి.రాందాస్, కె.శ్రీను, జె బాలరాజు, దేవన్న, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

కాఫీ బకాయిలు చెల్లించాలి

సిపిఎం మండల మహాసభలో పార్టీ నేత చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-జి.మాడుగుల: కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయిలు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. జి.మాడుగుల మండల సిపిఎం ఏడవ మహా సభ గేమ్మెలి పంచాయతీ మహాదేవపురంలో జరిగింది. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు వనుగు సన్యాసిదొర జెండాను ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022- 2023 సంవత్సరంలో కాఫీ ప్రోత్సాహక నిధులు కాఫీ లబ్ధిదారుల ఖాతాలో వేయలేదన్నారు.కాపీ రైతులకు అపెక్స్ కమిటీ ప్రకటించిన ధరలతో రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు.పార్చుమెంట్ కు కిలో రూ.500, అరబిక్ చెర్రీ 300, రోబోట్రో చెర్రీ 200 ధర ప్రకటించాలన్నారు. కాపీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్ ఆర్ .ఈ జీ ఎస్ కూలీలకు చట్ట ప్రకారం రోజు కూలి 300 ఇచ్చి గిరిజన ప్రాంతంలో 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల వచ్చిన తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులు పండించిన పసుపు, పిప్పళ్ళు, అల్లం, చిక్కుళ్ళు, చింతపండు కు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మండలంలో రోడ్డు, తాగు నీరు, పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై రాబోయే రోజుల్లో ఉద్యమం కొనసాగిస్తామన్నారు.ఈ మహాసభలో మండల నాయకులు. జగ్గందొర, దీన బంధు, వనుగు సన్యాసిదొర, పలసి సంకయ్య, బాణం ధర్మారావు, వంజారి పిన్నమనాయుడు, సత్తిబాబు, గణపతి, మధు, ఈశ్వరమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు :- కెజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన గిరిజన విద్యార్థి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ పేర్కొన్నారు. అనారోగ్యంతో వైద్య సేవలో పొందుతూ మృతి చెందిన అరకు వ్యాలీ గురుకుల (పి.వి.టి) పాఠశాల విద్యార్థి బడ్నాయిని ప్రవీణ్ కుమార్ మృతదేహానికి కే జి హెచ్ లో ఆదివారం పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించి ముంచంగి పుట్టు మండలం మాకవరం పంచాయతీ పొల్లిపుట్టు గ్రామానికి అంబులెన్సులో తరలించారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అదేశాల మేరకు గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి సంచాలకులు ఎల్.రజిని శనివారం రాత్రి కేజీహెచ్‌ను సందర్శించి విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్కడే ఉప సంచాలకులు అక్కడే ఉండి మృతదేహం తరలింపు ఏర్పాట్లు చేశారు. ప్రవీణ్ కుమార్ మృతికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు.

విఒఎల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి



సిఐటియు ఆధ్వర్యాన సమావేశంలో పాల్గొన్న విఒఎలు

ప్రజాశక్తి -సీలేరు: వెలుగు విఒఎలకు కాలపరిమితి విధిస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు కొనసాగింపుగా తెలుగుదేశం ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతురు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం జికె.వీధి మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే మూడు సంవత్సరాలు కాల పరిమితిని రద్దు చేస్తామని ఈ ఏడాది జనవరి 31న విజయవాడలో జరిగిన ధర్నాలో చంద్రబాబు వచ్చి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్వయం శక్తి సంఘాలను మూడు సంవత్సరాలకు మార్చే అవకాశం ఉందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న విఒఎలను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, 75మందిని అక్రమంగా తొలగించడం దుర్మార్గమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కాలపరిమితి ఉత్తర్వులను రద్దుచేయాలని, తొలగించిన విఒఎలను కొనసాగించడంతోపాటు విఒఎలకు బీమా, శ్రమకు తగ్గ వేతనం, ఇతర సౌకర్యాల కల్పనతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే తీవ్రఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెలుగు విఒఎల సంఘం మండల అధ్యక్షుడు కార్యదర్శులు ముర్వల పుష్ప, చిలకల రామలింగం, మండల సహాయ కార్యదర్శి సిరిబాల శోభన్ బాబు పాల్గొన్నారు.

మలుపులో పొంచి ఉన్న ప్రమాదం!

- కోతకు గురైన రోడ్డుతో వాహనదారుల భయం
- పట్టించుకోని ఆర్అండ్‌బి యంత్రాంగం



ఎర్రదిబ్బలు సమీపంలో ప్రధాన రహదారి మలుపులో కొట్టుకుపోయిన రహదారి

ప్రజాశక్తి -సీలేరు: గత నెలలో వరదలకు కొట్టుకుపోయిన ఎర్రదిబ్బలు ప్రధాన రహదారి మలుపు వద్ద పెద్ద గుంతను కప్పకుండా ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంపై వాహన చోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సీలేరుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్రదిబ్బలు ప్రధాన రహదారి మలుపు వద్ద గత నెలలో వర్షాలు, వరదలుకు రహదారి అంచు కోతకు గురైంది. ఈ రహదారిలో నిత్యం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి వచ్చే పోయే వాహనాలతో పాటు విశాఖ నుంచి సీలేరు మీదగా భద్రాచలం, నర్సీపట్నం నుంచి సీలేరు పాడేరు, డొంకరాయి బస్ సర్వీసులు ఇతర వాహనాలు వచ్చిపోతుంటాయి. ఈ మలుపులో వాహనదారులు ఏమాత్రమైనా ఆదమరిస్తే ప్రమాదం జరిగే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన చెందుతున్నారు. గతనెలలో వర్షాలు, వరదలకు కొట్టుకుపోయిన అనేక రహదారులు, గుంతలకు మరమ్మతులు చేపట్టిన ఆర్అండ్‌బి యంత్రాంగం, ఐస్ గెడ్డ, ఎర్రదిబ్బలు సమీపంలో ప్రధాన రహదారిలో మలుపులో కోతకు గురైన రోడ్డును పట్టించుకోకపోవడంపై వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళనకు గురౌతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి, ఈ మార్గంలో ప్రమాదాలకు అస్కారం లేకుండా చర్యలు చేపట్టడంతోపాటు మలుపులో రహదారి మరింతగా కోతకు గురికాకుండా ఉండేందుకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

108లో గర్భిణి ప్రసవం : తల్లీ బిడ్డ క్షేమం

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని కొత్తురు గ్రామానికి చెందిన గర్భిణీ వంతల వనజా 108 అంబులెన్స్‌లో ఆదివారం ప్రసవించింది. ఆమెకు పురిటి నొప్పులు రావడతంట కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా కాశీపట్నం మార్గ మద్యలో ప్రసవించింది.తల్లీ. బిడ్డ క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి తరలించారు.



108లో తల్లీ, బిడ్డ



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

- జెడ్‌పిటిసి గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ జామగుడ బీటి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే నిదులు మంజూరు చేయాలని స్దానిక జెడ్పీటీసీ దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. సీపీఎం శాఖ మహా సభ ఎగువశోభలో జరిగింది. అనంతరం గ్రామస్తులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, అరకు మెయిన్ రోడ్డు కాఫి తోటల నుండి జామగుడ, కమలపురం, పూలగుడ గ్రామం సుమారు ఐదు కిలోమీటర్ల బీటి రోడ్డు నిర్మాణనికి పల్లె పండుగలో భాగంగా కూటమి ప్రభుత్వం తక్షణమే నిదులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జామగుడ గ్రామంలో సీసిరోడ్డు, డ్రైనేజీలు, చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై అల్లరి జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఓ దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం శాఖ కార్యదర్శిగా మ్మెల సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు. సాగర రాజు, గోవింద్, మదు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు

యుటిఎఫ్ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: యుటీఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా మహసభను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావు కోరారు. ఆదివారం అరకులోయలో ఆదివాసి గిరిజన సంఘం భవనంలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ, సంఘం బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు యుటిఎఫ్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు.అరకులోయలో వచ్చే నెల 17న జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడమే లక్ష్యం

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ
- ఘనంగా జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు



పరంచోడవరంలో విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - రంపచోడవరం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం మండలంలోని ముసురుమిల్లి ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు వై విల్సన్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు మాట్లాడుతూ, పిల్లల విద్యాభివృద్ధికి, వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని, శాస్త్రీయ ఆలోచన పెంపొందించుకోవడానికి 34ఏళ్లుగా జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులంతా మూఢ నమ్మకాలను విడనాడి శాస్త్రీయమైన సౌకర్య జీవనానికి నాంది పలుకుతారని, శాస్త్రీయ సమాజ నిర్మాణానికి పూనుకుంటారని ఆశాభావం వ్యక్తంచేశారు. పోటీల్లో గెలిచిన వారితోపాటు, పాల్గొన్న వారంతా విజేతలేనన్నారు.


జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి సత్య నారాయణ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని సంబరాల్లోపాల్గొన్న విద్యార్థులు, వారి గైడ్ టీచర్స్ అందరికీ అభినందనలు తెలిపారు. జన విజ్ఞాన వేదిక 1990నుంచి చెకుముకి విద్యార్థి సైన్స్ మాసపత్రిక నిర్వహిస్తోం దన్నారు. విద్యార్థుల్లో నిబిడీ కృతమైన శక్తియుక్తులను వెలికి తీయడమే లక్ష్యంగా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లాస్థాయి సైన్స్ సంబరాలలో మొదటి బహుమతి పొందిన పాఠశాలల విద్యార్థులు వచ్చేనెల 9,10 తేదీలలో విశాఖపట్నంలో జరుగు రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు హాజరవ్వాలని కోరారు. జెవివి సీనియర్ నాయకులు రేవతి, సైన్స్ ఫౌండేషన్ అధినేత కె. శ్రీకృష్ణసాయి. సైంటిఫిక్ మ్యాజిక్, సైన్స్ ప్రాక్టికల్స్‌ను విద్యార్థులకు చేసి చూపారు.జిల్లాస్థాయి పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విభాగంలో నెల్లిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధమ బహుమతి, అడ్డతీగల జెడ్‌పిహెచ్‌ఎస్ రెండో స్థానంలో, మారేడుమిల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మూడోస్థానంలో నిలిచాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో కూనవరం విజయసాధన హైస్కూల్ ప్రధమ బహుమతిని గెలుపొందగా, కూనవరం డివివి పాఠశాల ద్వితీయస్థానంలో, రంపచోడవరం లెనోరా హైస్కూల్ తృతీయ బహుమతిని పొందాయి. అనంతరం విజేతలు, పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు మాజీ ఎంపిపి డాక్టర్ తీగల ప్రభ పేరున తీగల బొజ్యయ్య సమకూర్చిన మెమెంటోలు, ధ్రువపత్రాలు, సైన్స్ పుస్తకాలను డిఇఒ అందజేశారు. డిఇఒ, తీగల బొజ్జయ్యలను జనవిజ్ఞాన వేదిక చిరుసత్కారం చేసింది. కార్యక్రమంలో స్థానిక పాఠశాల వార్డెన్ విజయ రాజారావు, విశ్వరాజు, ఆచారి, కన్నారావు, డివివి సత్యనారాయణ, ఐతిరెడ్డి సత్తిరెడ్డి, చిన్ని బాబు, పైడిపల్లి, కానెం శ్రీను విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాడేరు: జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పాడేరులోని లోచలిపుట్టు బాలుర ఆశ్రమ పాఠశాల లో ఆదివారం చెకుముకి జిల్లాస్థాయి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ చెకుముకి సంబరాల్లో భాగంగా జరిగిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో ఏడు మండలాలకు (పాడేరు, అరకు, హుకుంపేట, పెదబయలు, ముంచంగ్‌పుట్టు, జి.మాడుగుల, చింతపల్లి)కి చెందిన తొమ్మిది పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రభుత్వ విభాగం నుండి అరకు క్రీడా పాఠశాల ప్రథమస్థానం, ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల, సీకరి ద్వితీయ స్థానం సాధించాయి. ప్రవేట్ పాఠశాలల విభాగం నుండి శ్రీ అక్షర పాఠశాల ప్రథమ స్థానం, పెదబయలు సెయింట్ ఆన్స్ పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన పాఠశాలలు నవంబరు 9న రాష్ట్ర స్థాయిలో విశాఖపట్నంలో జరిగే పోటీలలో పాల్గొనాలని జన విజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యండమూరి పారయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచు కోవాలని, మూఢనమ్మకాల పట్ల చైతన్యం కలిగి ఉండి నాటుమందులు, పసరు మందులకు దూరంగా ఉండాలని ఆయన చెప్పారు.



పాడేరులో చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న టిడిపి నేత దొన్నుదొర

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు కొ్ర.తులసిరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ సోమేద సత్యవతి, టిడిపి నాయకులు లక్ష్మయ్య ఆధ్వర్యంలో నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరకు అసెంబ్లీ ఇన్చార్జి సియ్యారి, దొన్ను దొర మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదును ప్రతి ఒక్కరు బాధ్యతగా వహించి త్వరగా పూర్తి చేయాలని కోరారు.క్లస్టర్ , యూనిట్, బూత్ ఇన్చార్జిలు, నియోజకవర్గ ముఖ్య నేతలు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, అందరూ సమన్వయంతో పనిచేసి సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జిసిసి డైరెక్టర్ లక్ష్మణ, నాయకులు బాలన్న, లక్ష్మయ్య, సత్య, బొంజు బాబు, శంకర్ నాయుడు, నాగేష్, సుమన్ పాల్గొన్నారు.

మాజీ సైనికుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ నందివలస గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పాంగి మల్లన్న అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబీకులను పరామర్శించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బాధిత కుటుంబీకులకు ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, సర్పంచులు సుబ్బారావు, సుస్మిత, నాయకులు అర్జున్లు సంతాపం తెలిపారు.

ప్రక్షాళన చేస్తున్నందుకే అభియోగాలు

- ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభావతి

ప్రజాశక్తి - చింతపల్లి: స్థానిక ఆసుపత్రిలో గతంలో జరిగిన అవకతవకలను ప్రక్షాళన చేసేందుకు ప్రయత్నిస్తున్న తనపై కొంతమంది సిబ్బంది అభియోగాలు మోపడం సరైన విధానం కాదని ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభావతి అన్నారు. వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలపై గురువారం ఆమె మాట్లాడుతూ, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను గాడిలో పెట్టే క్రమంలో భాగంగా సక్రమంగా విధులకు రాని వారిపై, అదే విధంగా సమయపాలన పాటించని వారిపై చర్యలు చేపడుతున్నానన్నారు. తనపై అభియోగాలు మోపి తన ప్రతిష్టను దిగజార్చాలని, తమకు అనుకూలమైన వారిని సూపరింటెండెంట్ గా నియమించుకుని వాళ్ల పనులను జరిపించుకోవాలని చూస్తున్నారని తెలిపారు.

డ్రెయినేజీలో చెత్తాచెదారం వేస్తే చర్యలు

ప్రజాశక్తి- చింతపల్లి : మండల కేంద్రంలోని డ్రైనేజీలో చెత్తాచెదారం వేస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు మురుగు కాలువలలో రాళ్లు, మట్టి వేసి ఆ తరువాత వాటిని తొలగించక పోవడంతో పలు వీధులలోని సిమెంటు రహదారిపై మురుగునీరు పారుతుందన్నారు. ఈ విధంగా మురుగు కాలువలు మూసుకుపోవడానికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండల కేంద్రంలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులను, పశువులను సంబంధిత యజమానులు అదుపు చేయాలన్నారు.

శిథిలావస్థలో ఉద్యోగుల క్వార్టర్లు

- నివాసముండేందుకు ఇళ్లులేక అవస్థలు
- ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలతో ఇబ్బందులు
- బయోమెట్రిక్, ఫేషియల్ హాజరు వేయలేక పరేషాన్
- క్వార్టర్ల ఏర్పాటుకు ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్లు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలో వివిధ శాఖలకు సంబంధించి వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు పనిచేస్తుండగా, వారికి స్థానికంగా నివాసముండేందుకు ఇళ్ల లేక నానా ఇబ్బందులు పడుతున్నారనిఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, నాయకులు పి లింగమూర్తి తెలిపారు. గతంలో ఇక్కడ అరకొరగా కొన్ని శాఖల ఉద్యోగులకు ప్రభుత్వపరంగా క్వార్టర్స్ నియమించినప్పటికీ, వాటి వినియోగం, నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయని, కొన్నింటిలో ఇతరులు,ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశారన్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ, సకాలంలో విధులకు హాజరుకాలేక, బయోమెట్రిక్, ఫేషియల్ హాజరును సకాలంలో వేయలేక అవస్థలు పడుతున్నారని వీరు అంటున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికార యంత్రాంగం దీనిపై దృష్టిపెట్టి, ఉద్యోగులకు అవసరమైన క్వార్టర్స్‌ను ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేయడంతోపాటు, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం నేతలు కృష్ణారావు, లింగమూర్తి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా, మండలంలో 16శాఖలకు చెందిన వందలమంది ఉద్యోగులు మండలంలో పనిచేస్తుండగా, అత్యవసర వైద్యసేవలు అందించే సిబ్బందికి కూడా క్వార్టర్స్ లేని పరిస్థితి ఉందన్నారు. గతంలో రెవెన్యు శాఖకు సంబంధించి ఆరు క్వార్టర్స్ నిర్మించగా, అందులో ఒకదానిలో పోస్టాఫీస్ నిర్వహిస్తున్నారు. మరో క్వార్టర్స్‌లో దాదాపు ఇరవై ఏళ్లుగా ప్రయివేటు వ్యక్తులు అద్దెవంటివేమీ లేకుండా దర్జాగా నివసిస్తున్నారు. మిగిలిన నాలుగింటిని ఇతర శాఖలు వినియోగిస్తున్నాయన్నారు.

ఇక విద్యాశాఖకు సంబంధించి సుకూరు, బాకూరు, అల్లంపుట్టు, పెదగరువు, హుకుంపేట ఆశ్రమ పాఠశాలలకు ఉద్యోగులు, సిబ్బందికి ఐటిడిఎ నిధులతో నిర్మించిన గృహ సముదాయాలు వాడకంలో లేక, స్వల్ప మరమ్మతులకు గురై, నిరుపయోగంగా మారి, అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయన్నారు. జిల్లా అధికారులు వీటిపై దృష్టి సారించ లేదన్నారు. అయితే ఉద్యోగులు స్థానికంగా నివాసముండేందుకు వసతి సదుపాయాలు కల్పించని ప్రభుత్వం, అధికార యంత్రాంగం, వారిని విధుల నిర్వహణలో సమయపాలన పాటించాలని, బయోమెట్రిక్, ఫేషియల్ హాజరు సకాలంలో వేయకుంటే చర్యలు తప్పవని వేధించడం, హెచ్చరించడం సముచితం కాదంటున్నారు. ముందుగా అవసరమైన వసతి సదుపాయాలను కల్పించి, అపుడు స్థానికంగాఉండకుంటే చర్యలు చేపట్టడం సమంజసంగా ఉంటుందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఐటిడిఎ, ఇతర సంబంధిత ఉన్నతాధికారులు దృష్టిసారించాలని, ప్రభుత్వం ఉద్యోగులు స్థానికంగా ఉండేందుకు క్వార్టర్స్‌ను నియమించడంతోపాటు ఉన్నవాటిని వినియోగంలోకి తేవాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలని సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం శిరగం పంచాయతీ రోడ్డు మరమ్మత్తు చేపట్టాలని ఆదివారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ, చొంపి, శిరగం జంక్షన్ నుండి శిరగాం వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాలు తేలిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరమ్మతు చేపట్టక పోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల పంచాయతీ అభివృద్ధికి దూరంగా ఉందని, రవాణా సౌకర్యాలు సక్రమంగా లేక పంచాయతీ ప్రజలు నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐటిడిఏ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు సౌకర్యం కూడా లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సోమన్న, చిట్టిబాబు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న సిపిఎం నేతలు, గ్రామస్తులు

ఉద్యాన సహాయకుల హేతుబద్ధీకరణను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యాన సహాయకుల హేతుబద్ధీకరణను ప్రభుత్వం తక్షణమే నిలుపుదల చేయాలని ఉద్యాన సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం పాడేరులో నిర్వహించిన ఉద్యాన సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి ఉద్యాన పంటలు విస్తీర్ణం ఆధారంగా ప్రస్తుతం మండల వారీగా అవసరమైన చోట ఉద్యాన సహాయకులుగా అల్లూరి జిల్లా వ్యాప్తంగా 122 మంది నియామకం జరిగిందన్నారు. ఇంకా ఉద్యాన పంటలు విస్తీర్ణం ను పరిగణలోకి తీసుకుని అదనంగా 76 ఉద్యాన సేవకులు పోస్టులు మంజూరు చేయవలసి ఉందన్నారు. రాష్ట్రంలో కూడా జిల్లాల వారీగా క్షేత్రస్థాయిలో ఉద్యాన పంటలు విస్తీర్ణాన్ని పరిగణలో తీసుకోని ఉద్యాన సహాయకులకు నియమించారని తెలిపారు. ఉద్యాన సహాయకుల హేతుబద్ధికరణ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యాన సహాయకుల స్థానంలో వ్యవసాయ సహాయకుల పోస్టులను నియమించాలని ఉన్నత అధికారులు ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఈ ప్రక్రియ కొనసాగితే కొన్ని మండలాలలో ఉద్యాన సహాయకులు పోస్టులు పూర్తిస్థాయిలో కుదించ బడుతుందన్నారు. ఈ విధమైన హేతుబద్ధికరణతో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉద్యాన సహాయకులతో పాటు గిరిజన ప్రాంతంలో ఇప్పుడిప్పుడే ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపుతున్న రైతులకు భవిష్యత్తులో తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఇష్ట రాజ్యంగా ఏకపక్షంగా వ్యవసాయ అధికారాలు వ్యవహరించడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలుగా ఉద్యాన వాణిజ్యపరమైన పంటలు వాటి విస్తీర్ణం అభివృద్ధికి కషి చేయడం కొరకు ఉద్యాన సహాయకుల అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.ఉద్యాన శాఖ అధికారులు జోక్యం చేసుకొని పూర్తిస్థాయిలో ఏజెన్సీ ప్రాంతంలో వాణిజ్య పరమైన ఉద్యాన పంటలు అభివృద్ధికి తోడ్పడే విధంగా కృషి చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

కెజిహెచ్ కేన్సర్ విభాగం ఆధునికీకరణ

- సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జి ఆసుపత్రిలో కేన్సర్ రోగులకు ఉచిత వైద్య చికిత్సను అందజేస్తున్నామని ఇందులో భాగంగా ఆ విభాగాన్ని ఆధునికీకరించినట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఆదివారం సాలిపేట కమ్యూనిటీ హాల్లో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటుచేసిన రొమ్ము కేన్సర్ అవగాహన శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ శివానంద మాట్లాడారు. కెజిహెచ్‌లోని కేన్సర్ విభాగంలో రూ.28 కోట్లతో అధునాతన సాంకేతిక పరికరాలు, సిములేటర్ లీనియర్ యాక్సిలేటర్‌ను సమకూర్చుకున్నట్లు చెప్పారు. దీని సాయంతో కేన్సర్‌కు మెరుగైన చికిత్సను అందజేస్తున్నామన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చుకాగల వైద్యానికి ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందజేస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రొమ్ము కేన్సర్‌ను మొదటి, రెండో దశలో గుర్తించినట్లయితే వ్యాధి పూర్తిగా నయం కానుందని చెప్పారు. చైతన్య స్రవంతి వాలంటీర్లు పాఠశాలల్లో అవగాహనా శిబిరాలు ఏర్పాటుచేసి రొమ్ము కేన్సర్‌పై పిల్లలకు చైతన్యం కల్పించాలని కోరారు. రొమ్ముల్లో గడ్డలు ఏర్పడిన సందర్భంలో నొప్పి ఉన్నా లేకపోయినా మెమోగ్రామ్ పరీక్ష చేయించుకున్నట్లైతే వ్యాధి నిర్ధారణ కానుందని తెలిపారు. త్వరలో రొమ్ము కేన్సర్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని, దీన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. కెజిహెచ్ కేన్సర్ విభాగం హెడ్ డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ, ఆసుపత్రిలో రోగులకు విరివిగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తూ వ్యాధిని నిర్ధారిస్తున్నామని తెలిపారు. మహిళలు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా రొమ్ముల్లో గడ్డలు ఏర్పడిన సందర్భంలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా వివిధ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా రొమ్ము కేన్సర్ లక్షణాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో చైతన్య స్రవంతి ప్రతినిధులు విజయ, రుకీయబాను, శారద, అనసూయ పాల్గొన్నారు.

మిద్దె తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మిద్దె తోటల మీద నగరవాసులకు అవగాహన ఉండాలని వనమాలి, సిటిజి గార్డెనింగ్ సంస్థలు నగరంలోని పలు ప్రదేశాలలో శని, ఆదివారాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇచ్చి పుచ్చుకునే విధానంలో కూరగాయల మొక్కలు, అంట్లు, విత్తనాలు పంపిణీ చేశారు. ఎకో వైజాగ్‌లో భాగంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిద్దె తోటలపై నగరం అంతటా ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ ప్రతినిధులు అరవల అరుణ, మళ్ల సరిత, నాదెళ్ల జ్యోతి మాట్లాడుతూ, రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు, కలుపుతీత ముందులతో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నామని తెలిపారు. ఎవరి ఇంటి వద్ద వారు కూరగాయలు, ఆకుకూరలు పండించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు తమను 7794930439, 8121382753, 8500874103 నెంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో 'ఏకో విజనరీ' పర్యావరణ సంస్థ ప్రతినిధులు జి.దనూష, డి.పూజిత, కె.మేఘన, కెఎల్.దీపిక, కె.కుసుమ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగమణి

గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- కూనవరం: మండలంలోని రేపాక గ్రామంలో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో అవసరమైన చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ నాగమణి వెల్లడించారు ఆదివారం కొత్త పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ పెద్ద ఆర్కూర్ పంచాయతీలో పాలకమండలిగా ఏర్పడిన తర్వాత అన్ని గ్రామాలలో మంచినీటికి ఇబ్బందులు లేకుండాచర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాకలెక్టర్, ఐటిడిఎ పిఒలు, సంబంధిత అధికారుల సహకారంతో గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. రేపాకపాడుతోపాటు రేపాక కాలనీలో కొత్త పైపులైన్ ఏర్పాటు, పెద్ద ఆర్కూర్‌లో పైపులైన్ పొడిగింపు పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు తొండ లక్ష్మణ్, మండల ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బాబు బొర్రయ్య, తెల్లం తమ్మయ్య, పోడియం రామారావు, కన్నయ్య, స్థానిక గిరిజన సంఘం నాయకులు మడకం జోగయ్య, పంచాయతీ సెక్రెటరీ, గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు జీతాలివ్వకుండా.. ఆంక్షలా.. ? : సిపిఎం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు ఇవ్వకుండా యాజమాన్యానికి ఆంక్షలు విధించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. జగదాంబ జంక్షన్ దరి నండూరి ప్రసాదరావు భవనంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆఫీసర్లకు, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలివ్వకుండా ఆర్థికంగా దెబ్బతీసే కుట్రలను కేంద్ర బిజెపి ప్రభుత్వం చేపట్టడం దుర్మార్గమన్నారు. ఉద్యోగులు, కార్మికులు వారంతటవారే ఉద్యోగం వదిలిపోయేలా చేసి ప్లాంట్‌ను ముంచేసే కుట్రలకు మోడీ సర్కారు పూనుకుందన్నారు. ఈ కుట్రలను వెంటనే విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో జీతాలు ఆఫీసర్లకు, పర్మినెంట్ కార్మికులకు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా అందేవన్నారు. దీపావళి పండగ వచ్చినా నేటికీ ప్రస్తుతం జీతాలు లేవన్నారు. నాడు దసరా పండగకు బోనస్ రూ.26 వేలు వచ్చేదని, వాటినీ నేడు చెల్లించలేదని అన్నారు. హెచ్ఆర్ఎ రూ.7 వేల మందికి కటింగ్ చేశారన్నారు. 5,500 కుటుంబాలకు కరెంటు ఛార్జీలు భారీగా పెంచారన్నారు. కాంట్రాక్టు కార్మికులకు, హోం గార్డులకు, సెక్యూరిటీ గార్డులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. జీతాలు, హెచ్ఆర్ఎ బోనస్ ఇవ్వడానికి స్టీల్‌ప్లాంట్ వద్ద డబ్బులు లేక కాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు వస్తున్న ఆదాయాన్ని రూ.440 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారని, రూ.70 కోట్లు ఖాతాలో ఉన్నాయని అన్నారు. డబ్బులు ఉండి కూడా జీతాలు చెల్లించటం లేదని ఆయన విమర్శించారు. స్టీల్ మినిస్టరీ నుండి ఆదేశాలు వచ్చాయి గనుక చెల్లించడం లేదని స్పష్టంగా యాజమాన్యమే చెబుతోందని, ఇది చాలా దుర్మార్గమని అన్నారు.

సంస్థ ఉత్పత్తిలో భాగస్వాములైన ఆఫీసర్లకు, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఆపాలని చెప్పడమంటే ప్లాంట్‌ను దెబ్బతీసే చర్యే అవుతుందని అన్నారు. కేవలం కార్మికులను ఆర్థికంగా బలహీనపరిస్తే వారంతటవారే బయటకు పోతారని భావించి ప్రభుత్వం పెట్టిన విఆర్‌ఎస్ పథకాన్ని సులువుగా అమలు చేయొచ్చన్న కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోందన్నారు. కాంట్రాక్టు కాలం పూర్తయిన కాంట్రాక్టులను రెన్యువల్ చేయకుండా సుమారు 900 మంది కాంటాక్ట్ కార్మికులను బయట పెట్టారని చెప్పారు. 50 సంవత్సరాల వయస్సు దాటిన వారిని మెడికల్ అన్ ఫిట్ పేరుతో బయటకు పంపే కుయుక్తులు పన్నారని తెలిపారు. ఉద్యోగులను, కార్మికులను భారీగా తగ్గించి తమకు అనుకూలంగా ఉన్న కార్పొరేట్ సంస్థలకు స్టీల్‌ప్లాంట్‌ను అప్పగించే బిజెపి కుట్ర స్పష్టంగా అర్థమవుతోందన్నారు. బిజెపి చర్యలను చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, కూటమి నేతలు నిలువరించాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా నష్టం జరగకముందే వారు స్పందించాలని కోరారు.

ఇదేం సంప్రదాయం.. ?

- డబ్బులిచ్చిన వారికి సన్మానాలు
- భూములిచ్చిన రైతులు రోడ్లపాలు
- అభిజిత్ కార్మికుల గోడు పట్టించుకోని అధికారులు
- కొత్త ఒరవడికి తెరలేపిన ప్రభుత్వ యంత్రాంగం
- అధికార పార్టీ నాయకులను సంతృప్తిపరిచే పని

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం కొత్త ఒరవడికి తెరలేపింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సిఎస్ఆర్) కింద డబ్బులిచ్చిన యాజమాన్య ప్రతినిధులను సన్మానించి సంతృప్తిపర్చే కార్యానికి ఒడిగట్టింది. మంచి పనులు చేసే వారిని ప్రోత్సహించడం సత్సంప్రదాయమైనా, పరిశ్రమల కాలుష్యంతో భరించలేని ప్రజలను వదిలేసి కొద్దిమంది రాజకీయ నాయకులను సంతృప్తిపర్చే పనికి అలవాటుపడ్డ వారిని ప్రభుత్వ యంత్రాంగం సన్మానించడం విమర్శలకు తావిస్తోంది. కాలుష్య బాధిత ప్రజలను విస్మరిస్తున్న పరిశ్రమాధిపతులను సన్మానించి.. జిల్లా ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలు కీలకమని చెబుతూ, ఎటువంటి సహకారం కావాలన్నా నేరుగా సంప్రదించవచ్చని కంపెనీ ప్రతినిధులకు కలెక్టర్ విజయకృష్ణన్ భరోసా ఇవ్వడం విస్తుగొలుపుతోంది. సామాజిక బాధ్యతగా ఇవ్వాల్సిన నిధులను దయతో కంపెనీలు ఇస్తున్నట్లు అధికారులు భావిస్తున్నట్లుంది.

సిఎస్ఆర్ కింద డబ్బులిచ్చిన కంపెనీ ప్రతినిధులకు ధైర్యమిచ్చిన కలెక్టర్‌కు పరిశ్రమలకు భూములిచ్చి ఉపాధిలేని, కాలుష్యంతో నిరంతరం బాధపడుతున్న నిరాశ్రయులు గుర్తుకువచ్చినట్లులేదు. నిధులిస్తే మీ జోలికి రామన్న సంకేతాలు ఇచ్చినట్లన్పించింది. చట్టవిరుద్ధంగా లే ఆఫ్ ప్రకటించి వెయ్యి మంది కార్మికులను ఉన్నపలానా వీధినపడేసిన అభిజిత్ యాజమాన్యంపై కనీస చర్యలు లేవు. తమ పరిధిలో చేయాల్సిన, తీసుకోవాల్సిన చర్యలకు కూడా కలెక్టర్ సిద్ధపడ్డంలేదు. 17 ప్రాణాలను బలితీసుకొని, 38 మంది గాయపడ్డానికి కారణమైన అసెన్షియా కంపెనీ యాజమాన్యంపై ఇంతవరకు కఠిన చర్యలేవీ తీసుకోలేదు. నలుగురు కార్మికుల ప్రాణాలు తీసిన సినర్జిన్ కంపెనీ యాజమాన్యంపై తీసుకున్న చర్యలు నామమాత్రమే. అసెన్షియా రూ.5 లక్షలు, కనీస కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించని ర్యాంకీ ఫార్మాసిటీ పది లక్షల రూపాయలు, ఇలా పలు కంపెనీల నుంచి విజయవాడ వరద విరాళాలు ప్రభుత్వానికి అందించాయి. వాస్తవానికి జిల్లాలోని పరిశ్రమల నుంచి ఎంత మొత్తంలో సిఎస్ఆర్ నిధులు రావాల్సివుంది.. ? నిబంధనల ప్రకారం సామాజిక బాధ్యత కింద నిధులు కేటాయిస్తున్నారా ? లేదా ? అనే పర్యవేక్షణ సరిగాలేక యజమానులు వారిష్టానుసారం వినియోగిస్తున్నారు. సిఎస్ఆర్ నిధులను తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన, పర్యావరణ పరిరక్షణ వంటి పలు కార్యక్రమాలకు వినియోగించాల్సివుంది. కానీ అధికార పార్టీ నాయకులు కొంతకాలంగా ప్రభుత్వం నుంచి చేయాల్సిన పనులను సిఎస్ఆర్ నిధులతో చేయించడంతో వాటి ప్రయోజనం పక్కదారిపడుతోంది.



పరిశ్రమల ప్రతినిధులకు జ్ఞాపికలు ఇస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ (ఫైల్ ఫొటో)

కంపెనీ నికర పెట్టుబడి విలువ రూ.500 కోట్లు, అంతకు మించి, వెయ్యి కోట్లు, అంతకుపైగా టర్నోవర్ కలిగి, ఏడాదికి నికర లాభం ఐదు కోట్లు కలిగిన కంపెనీలు రెండు శాతం సిఎస్ఆర్ కింద నిధులు ఇవ్వాల్సివుందని అధికారి ఒకరు తెలిపారు. ఈ తరహా పరిశ్రమలను గుర్తించి, నిధులు వచ్చే పని సరిగా చేయకపోవడంతో నచ్చినట్లు యాజమాన్యాలు ఖర్చు పెట్టి సిఎస్ఆర్ కింద చూపిస్తున్నాయన్న విమర్శలున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రతిపాదిత పనులకు ఇస్తున్న ప్రాధాన్యత తీవ్రమైన సమస్యల పరిష్కారానికి సిఎస్ఆర్ నిధులను అధికారులు వినియోగించడంలేదు. నక్కపల్లిలో ఎస్‌సి బాలుర వసతి గృహంలో విద్యార్థులు తాగునీరు, కరెంట్, మరుగుదొడ్లు లేక అనేక అవస్థలు పడుతున్నా అధికారులకు పట్టడంలేదు. భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఉపాధి, నివాసిత ప్రాంతాల్లో తాగునీరు, విద్య, వైద్యం వంటి వాటిపై శ్రద్ధ చూపకుండా కంపెనీ ప్రతినిధులను సన్మానించడం తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లయింది. జిల్లాలో రెడ్ కేటగిరి పరిశ్రమలు 224, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలు 29 వున్నాయి. ఈ పరిశ్రమల్లో కార్మికుల భద్రత, రక్షణ పరికరాలు సరఫరా, పర్యావరణ పరిరక్షణ ప్రమాణాల అమలుపై సమీక్షించాల్సిన అధికార యంత్రాంగం సన్మానాలతో మురిపించే పనిలో వున్నట్లు కనబడుతోంది. సిఎస్ఆర్ పరిధిలోకి వచ్చే కంపెనీలను గుర్తించి, వాటి నుంచి నిధులు రాబట్టి నిబంధనల ప్రకారం వినియోగించేపని ఇప్పటికైనా ప్రారంభించాలని ప్రజలు, నిర్వాసిత కుటుంబాలవారు కోరుతున్నారు.

తోపుడు బండ్ల కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి,-ఎంవిపి కాలనీ : చిన్న వాల్తేర్ కోటక్ స్కూల్ వద్ద తొలగించిన తోపుడుబండ్లను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉదయం చిన్న వాల్తేర్ మానసిక హాస్పిటల్ జంక్షన్ నుంచి వామన జంక్షన్ మీదుగా రైల్వే గెస్ట్ హౌస్ సెంటర్ వరకు సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఉపాధి రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం మానసిక హాస్పిటల్ జంక్షన్ వద్ద నిర్వహించిన సభలో విశాఖపట్నం తోపుడు బండ్లు, చిల్లర వర్తక కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే తోపుడు బండ్లు కార్మికులపై దాడులు పెరిగాయన్నారు. ట్విట్టర్ కంప్లైంట్ ద్వారా తోపుడు బండ్లను జివిఎంసి కమిషనర్ తొలగించడం అన్యాయమన్నారు. నగరంలో అనేక చోట్ల అమూల్ బడ్డీలు ఉండగా చిన్న చిన్న తోపుడుబండ్లే మీకు కనిపించాయా అని ప్రశ్నించారు. సిఐటియు సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు మాట్లాడుతూ, రెక్కాడితే గాని డొక్కాడని కార్మికులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. సిఐటియు మద్దిలపాలెం జోన్ నాయకులు కె.కుమారి మాట్లాడుతూ తోపుడుబండ్లను యథావిధిగా కొనసాగించకపోతే జివిఎంసి ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి, తోపుడు బండ్లు సంఘం గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు, ఎ.అప్పారావు, కెఎన్.గణేష్, కె.రాజు, సుమారు 50 మంది తోపుడుబండ్ల కార్మికులు పాల్గొన్నారు.



ఆయుధాల పనితీరును వివరిస్తున్న ఎస్ఐ అప్పలసూరి

సీలేరులో పోలీసుల ఓపెన్ హౌస్

ప్రజాశక్తి -సీలేరు: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా వారి త్యాగాలను స్మరించుకుంటూ ఆదివారం సీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో పోలీసులు వినియోగించే ఆయుధాలు, ఇతర పరికరాలతోపాటు స్టేషన్‌లోని వివిధ విభాగాలు వాటి పనితీరుపై జికె.వీధి ఎస్ఐ అప్పలసూరి విద్యార్థులకు వివరించారు

. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసుల కష్టాన్ని, శ్రమను అర్థం చేసుకుని, వారి నుంచి స్ఫూర్తిని పొంది భవిష్యత్తులో పోలీసులకు అనివిధాలాసహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాసేవకే పోలీసుశాఖ ఉందని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. పోలీసు విధుల్లో చేరేందుకు యువత ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో ప్రేరణ, స్ఫూర్తి కలిగించే లక్ష్యంగా ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీసులు చర్యలను వివరించామన్నారు. సమాజ భద్రతకు, ప్రజల రక్షణకు విధి నిర్వహణలో అమరులైన పోలీసులు త్యాగాన్ని స్మరించుకుందామన్నారు. ఈసందర్భంగా పోలీసుల విధులు,బాధ్యతలపై వ్యాసరచన, వక్తృత్వ పరీక్ష పోటీలు నిర్వహించారు.కార్యక్రమంలో ఇఎంఆర్ స్కూలు, ఎపిఆర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పోషకాహారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆహార రంగ నిపుణులు, న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ లీల కృష్ణస్వామి సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ఆహారం అనే అంశంపై బీచ్ రోడ్‌లోని ఓ హోటల్‌లో జరిగిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడుతూ వేడుకల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై దృష్టి సారించాలన్నారు. బరువు పెరగడం, రక్తంలో చక్కెర పెరుగుదలను నివారించేందుకు తీసుకునే ఆహారం పట్ల అందరూ జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా తృణధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాదం తరహా గింజలు ఆరోగ్యానికి మంచివని తెలిపారు. బాదంపప్పులో ప్రోటీన్, కాల్షియం, జింక్, డైటరీ ఫైబర్, మెగ్నీషియం వంటి 15 ముఖ్యమైన పోషకాలు ఉన్నాయన్నారు. ఈ సదస్సులో డైటెటిక్స్ హెడ్ రితికా సమద్దర్, ఫిట్‌నెస్ కోచ్ డాక్టర్ రోహిణి పాటిల్, డాక్టర్ మధుమిత కృష్ణన్ పాల్గొన్నారు.

వ్యాపార విస్తరణకు విశాఖ అనుకూలం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టైర్ 2 నగరాల్లో ఒకటైన విశాఖపట్నం వ్యాపార విస్తరణకు ఎంతో అనుకూలమైనదని బిగ్ బాస్కెట్ రిటైల్ మార్కెటింగ్ హెడ్ రాగాలీన శ్రీపాద అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. విశాఖపట్నం లాంటి టైర్ 2 మార్కెట్లు తమకు చాలా ముఖ్యమైనవన్నారు. టైర్ 2 నగరాల్లో ఉండే కస్టమర్‌కు 10 నిమిషాల్లో డెలివరీ చేయబడిన విస్తృత శ్రేణి ఉత్పత్తుల పట్ల వారు చూపుతున్న ఉత్సాహాన్ని చూసి సంతోషంగా ఉందన్నారు. ఈ దీపావళికి బంగారం, వెండి నాణేలు, హోమ్ డెకర్, డ్రై ఫ్రూట్స్, గిఫ్టింగ్ శ్రేణి సహా దీపావళికి అవసరమైన అన్ని వస్తువులను 10 నిమిషాలలో ఇంటి వద్దకు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

ఘనంగా సిస్టర్ నివేదిత జయంతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 39వ వార్డులోని శ్రీ స్వామి వివేకానంద సంస్థలో స్వామి వివేకానంద శిష్యులు సిస్టర్ నివేదిత జయంతిని 27, 28, 29 తేదీలలో నిర్వహించనున్నారు. మొదటి రోజు ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువజన నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ పాల్గొని నివేదిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిస్టర్ నివేదిత వివేకానందుడి బోధనలకు ప్రభావితమైన మొదటి విదేశీ మహిళ అన్నారు. మహిళా విద్యాభివృద్ధి కోసం ఆమె ఎంతో కృషి చేశారని తెలిపారు. మానవసేవే, మాధవ సేవగా శ్రీ వివేకానంద సంస్థ కూడా ఆ మార్గంలోనే సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.